తెలంగాణపై చలిపంజా

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో పొగమంచులో వస్తున్న రైలు

- భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్ర వ్యాప్తంగా 15 డిగ్రీలలోపు నమోదు
- 12 జిల్లాల్లో సింగిల్ డిజిట్ టెంపరేచర్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తేతెలంగాణ) : తెలంగాణలో చలి పంజా విసురుతున్నది. అల్పపీడన ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.3 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. నిర్మల్ జిల్లా తాండ్రలో 6.6, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 6.7, సంగారెడ్డి 6.8, కామారెడ్డి 7.6, నిజామాబాద్ 7.7, మెదక్ 8, జగిత్యాల 8, వికారాబాద్ 8.2, రాజన్నసిరిసిల్ల 8.6, సిద్దిపేట 8.6, రంగారెడ్డి 8.9, పెద్దపల్లిలో 9.5 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 14 డిగ్రీల సెల్సియస్‌కు తక్కువగా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఒక టర్మ్‌కే 'స్థానిక' రిజర్వేషన్

- రేపు అసెంబ్లీకి బిల్లు
- ఇద్దరు పిల్లల నిబంధనల్లో మార్పులు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తేతెలంగాణ): ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న ప్రభుత్వం.. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరించేందుకు సిద్ధమవుతున్నది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పజేసుకోవాలని నిర్ణయించింది. వీలైతే సోమవారమే క్యాబినెట్ ఆమోదం తీసుకొని మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది.

సవరణ బిల్లులోని అంశాలు

పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణ బిల్లులో గత ప్రభుత్వం తెచ్చిన చట్టంలోని కీలక అంశాలను మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న రెండు విడతల రిజర్వేషన్ పద్ధతిని తొలగించి పాత విధానంలో ఒకే విడతకు రిజర్వేషన్ కొనసాగించనున్నట్టు తెలిసింది. ముగ్గురు పిల్లలు ఉన్నా పోటీ చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ప్రస్తుతం కనీసం ముగ్గురు ఎంపీటీసీలు ఉన్న మండలాల్లో ఎంపీపీ ని ఎన్నుకునే అవకాశం ఉన్నది. ఈ క్లాజ్‌ను మార్చి ప్రతి మండలానికి కచ్చితంగా ఐదుగురు ఎంపీటీసీలు, ఆపైనా ఉండాలని నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలు ఐదు కంటే తక్కువ ఉన్న రాష్ట్రంలోని 22 మండలాల్లో ఎంపీటీసీల సంఖ్య పెరగనున్నది. ఈ సవరణతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలు 5,817 ఉండగా, మరో 50కిపైగా పెరగనున్నాయి.

కఠినంగా గ్రూప్-2 ప్రశ్నలు

- పెద్దవిగా ఉండటంతో సరిపోని సమయం
- సెల్‌ఫోన్‌తో పరీక్షరాస్తూ పట్టుబడ్డ అభ్యర్థి
- పరీక్షకు 54 శాతం అభ్యర్థుల డుమ్మా
- ఆర్ఆర్‌బీ పరీక్ష ఉండడంతోనే గైర్హాజరు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లోనూ ప్రశ్నలు అత్యంత కఠినంగా వచ్చాయి. స్టేట్‌మెంట్ ఆధారమైనవి ఎక్కువగా ఉండటం, ప్రశ్నలు పెద్దవిగా ఉండటంతో అభ్యర్థులకు సమయం సరిపోలేదు. జనరల్ స్టడీస్ పేపర్ అత్యంత కఠినంగా ఇచ్చారు. చాలాకాలంగా ప్రిపేరవుతున్న వారు సైతం 150కి 70-90కిపైగా స్కోర్‌చేయలేని విధంగా ప్రశ్నలు ఇచ్చారు. పేపర్-2లో చరిత్రలో ప్రశ్నలు అత్యంత కఠినంగా ఉన్నాయి. జనరల్ స్టడీస్‌లో తెలంగాణ పాలసీలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు, ఆస్కార్, చలనచిత్ర అవార్డులపై ప్రశ్నలొచ్చాయి. గ్రూప్-2 పరీక్షలు సోమవారం సైతం జరగనున్నాయి. ఉదయం పేపర్-3, మధ్యాహ్నం పేపర్-4కు పరీక్షలు జరగనున్నాయి.

అభ్యర్థుల అభ్యంతరాలిలా..

- గ్రాంథీక భాషను వాడటంతో ఒకటికి రెండుసార్లు ప్రశ్నలు చదవాల్సి వచ్చింది.
- జతపరచడం, సరైనవి ఏవీ. సరికానివి ఏవీ అన్న ప్రశ్నలే అధికంగా ఇవ్వడంతో సమయం సరిపోలేదు.
- స్టేట్‌మెంట్లు, క్రోనాలజీ ఆర్డర్‌కు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా ఇచ్చారు.
- తెలంగాణ చరిత్ర, దేశ చరిత్ర ప్రశ్నలు ఎక్కడినుంచి వచ్చాయో తెలియక అభ్యర్థులు టెన్షన్ పడ్డారు.
- ఇంగ్లిష్‌లో ఇచ్చిన 20 ప్రశ్నలకు లోతైన పరిజ్ఞానం ఉంటే తప్ప ఆన్సర్ చేయలేని పరిస్థితి.

నామమాత్రంగానే సెంటర్ల తనిఖీలు

- జనగామ జిల్లాలో సెయింట్‌మేరీస్, సెయింట్ మారియా పాఠశాలలు పక్కపక్కనే ఉండగా, ఓ మహిళా అభ్యర్థి ఒక సెంటర్‌కు బదులు మరో సెంటర్‌కు వెళ్లింది. పొరపాటు జరిగిందని తెలుసుకుని పక్క సెంటర్‌కు వెళ్లే వరకు సమయం మించిపోవడంతో ఆ అభ్యర్థి పరీక్ష రాసే అవకాశం కోల్పోయింది.
- సంగారెడ్డిలో 15 మంది, కరీంనగర్‌లో 14, సిద్దిపేటలో 12 మంది ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. సికింద్రాబాద్ పీజీ కాలేజీ వద్ద ఓ మహిళా అభ్యర్థి ఆలస్యంగా చేరుకుంది. అదే సమయంలో టీజీపీఎస్సీ చైర్మన్ బీ వెంకటేశం తనిఖీకి రాగా, ఆయన్ను వేడుకున్నా ఫలితంలేకుండా పోయింది.
- వికారాబాద్ జిల్లా శ్రీసాయి డెంటల్ కాలేజీ సెంటర్‌లో ఓ అభ్యర్థి ఫోల్డెడ్ సెల్‌ఫోన్‌తో పరీక్షకు హాజరయ్యాడు. మధ్యలో గుర్తించిన అధికారులు అభ్యర్థిని పోలీసులకు అప్పగించి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదుచేశారు.

సికింద్రాబాద్ పీజీ కాలేజీ వద్ద ఆలస్యం కావడంతో లోపలికి అనుమతించాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంను వేడుకుంటున్న అభ్యర్థిని

46 శాతం మాత్రమే హాజరు

పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్‌కు 46.75 శాతం, పేపర్-2 పాలిటీ, హిస్టరీ సోషియోకల్చర్‌కు 46.30 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. ఈ పరీక్షకు 5,51,855 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పేపర్-1ను 2,57,981 మంది, పేపర్-2ను 2,55,490 మంది రాశారు. గతానికి భిన్నంగా గ్రూప్-2 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు నిరాసక్తత కనబరిచారు.